సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 8 । జనవరి । 2023



జాబ్ మేళాకు స్పందన
కొత్తగూడెంలో శనివారం జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 10లో



ప్రతీ మొక్క బతకాలి
నాటిన ప్రతీ మొక్కా బతకాలని జెడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. 3 ఇంక్లైన్ పంచాయతీలో పర్యటించారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
30° / 12°
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగతలే నమోదవుతాయి. ఉదయం, రాత్రి వేళలో చలి ప్రభావం ఉండవచ్చు.

న్యూస్‌రీల్

రామయ్యకు రాపత్తు సేవ



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. శనివారం గోదావరి ఒడ్డున ఉన్న పునర్వసు మండపంలో రాపత్తు సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత పల్లకీలో స్వామి వారిని మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి మండపంలో కొలువుదీర్చారు. భక్తులు స్వామి వారికి పండ్లను నైవేద్యంగా అందచేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి హారతి సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, పండితులు భక్తులు పాల్గొన్నారు.

చతుర్వేద గ్రంథాల ఆవిష్కరణ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థాన రామాయణ పారాయణదారులు ఎస్‌టీజీ కృష్ణమాచార్యులు రచించిన చతుర్వేద గ్రంథాలను కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి ఆవిష్కరించారు. శనివారం విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో వేద గ్రంథాలను స్వామిజీ ఆవిష్కరించి శుభాశీస్సులను అందచేశారు. ఈ సందర్భంగా స్వామిజీకి శ్రీ సీతారాముల శేషవస్త్రాలు, జ్ఞాపిక, ప్రసాదాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల రచయిత కృష్ణమాచార్యులు, దేవస్థాన సామవేద పండితులు సన్యాసి శర్మ, శాస్త్ర పండితులు ఓరుగంటి రామలాల్ పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట ఆందోళన



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

భద్రాచలంఅర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నాలుగు గంటలపాటు ఖాళీ కంచాలతో ధర్నా నిర్వహించారు. రెండేళ్లుగా వేతనాలు రాక పస్తులుంటున్నామని, అయినా గిరిజన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు, జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మచారి మాట్లాడుతూ కార్మికుల జీతాలకు అవసరమైన బడ్జెట్‌ను ప్రభుత్వం కేటాయించాలని కోరారు. ఈ 8న గిరిజన ఎమ్మెల్యేల ఇళ్ల ముందు ధర్నా చేస్తామని, 9న ఏటీడబ్ల్యూ కార్యాలయాలను దిగ్బంధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు హీరాలాల్, నాగరాజు, ముత్తయ్య, జలందర్, ఈసం పద్మ, జయ, సమ్మక్క, ముసలయ్య, రామ, రంజిత, కౌసల్య, నాగమణి, సుభద్ర, రమేష్, లాలయ్య, యశోద, రమణ, లక్ష్మి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో అవినీతిపై పోరాటం

బీఎంఎస్ నేత మాధవ్ నాయక్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మాధవ్ నాయక్

ఇల్లెందు: సింగరేణిలో అవినీతిపై, బకాయిలు రాబట్టేందుకు బీఎంఎస్ పోరాడుతోందని ఆ పార్టీ నేత పి.మాధవ్‌నాయక్ అన్నారు. శనివారం ఇల్లెందులోని జేకే ఓసీ పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ తమ సంఘం కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. 11వ వేతన ఒప్పందంలో మినిమం గ్యారంటీ బెనిఫిట్ 19 శాతం సాధించామని తెలిపారు. అలవెన్సులు, ఇతర సమస్యలను కూడా త్వరలో సాధిస్తామని పేర్కొన్నారు. సింగరేణికి రూ.25 వేల కోట్లు బకాయి రావాల్సి ఉన్నా టీబీజీకేఎస్ మాట్లాడటం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు మాధవరెడ్డి, చందర్, రాజశేఖర్, ప్రకాష్, రాము, శ్రీను, వెంకటేశ్వర్లు, శివ, పరంజ్యోతీ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌పై పోరు



కొత్తగూడెంలోని చిన్నబజార్ దుకాణాల సముదాయం

విస్తరిస్తున్న 'మన ఊరు-మన దుకాణం'..
- స్థానిక వ్యాపారాలను కాపాడుకునే ప్రయత్నం
- రోజూ సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం
- కొత్తగూడెంలో 50 రోజులు పూర్తిచేసుకున్న ఉద్యమం

కొత్తగూడెంఅర్బన్: వస్త్రవ్యాపారం, ఎలక్ట్రికల్, హోటళ్లు ఇలా ప్రతి రంగంలో కార్పొరేట్, ఆ స్థాయి శక్తులు ఆధునిక హంగులతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఈ క్రమంలో పాతతరం నుంచి చేపడుతున్న వ్యాపారాలు సాగడం లేదు. వ్యాపారులు ఆర్థికంగా నష్టపోయి గుమస్తాలుగా మారుతున్నారు. ఈ క్రమంలో తమ వ్యాపారాలను నిలబెట్టుకునేందుకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని స్థానిక వ్యాపారులందరూ కలిసి శాంతియుతంగా ఉద్యమం చేపట్టారు. వినియోగదారుల ఆదరణ పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలతో కొంత మేర ఫలితాలు వస్తున్నాయి. దాదాపు ఎనిమిది దశాబ్దాల క్రితం 1942లో కొత్తగూడెంలో ఉన్న సింగరేణి కార్మికుల కోసం ఆహారం, వస్త్రాలు, అన్ని రకాల సామగ్రి కోసం వ్యాపారం చేయాలని ఇల్లెందు (బొగ్గుట్ట)లోని సింగరేణి యాజమాన్యం ఇల్లెందులో ఉన్న వ్యాపారులను కోరింది. దీంతో కొందరు వర్తకులు కొత్తగూడెం వచ్చి వ్యాపారం చేయడం ప్రారంభించారు. ఆ విధంగా సింగరేణి యాజమాన్యం ఇక్కడ వ్యాపారానికి ఊపిరిపోసింది. అప్పటి నుంచి రకరకాల దుకాణాలు ఏర్పడ్డాయి. సింగరేణి కార్మికులతోపాటు స్థానిక, పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చాయి. కానీ ఇటీవల నెలకొల్పుతున్న కార్పొరేట్ వ్యాపారాలతో అప్పటి దుకాణాలు కుదేలు అవుతున్నాయి. ఈ క్రమంలో పాతతరం వ్యాపారాన్ని నిలబెట్టుకునేందుకు వస్త్ర వ్యాపార వేత మొరిశెట్టి భవాని ప్రసాద్‌కు వచ్చిన ఆలోచనను వ్యాపారులంతా కలిసి ముందుకు నడిపిస్తున్నారు.

శాంతియుత పోరాటానికి 50 రోజులు పూర్తి..
పాతతరం దుకాణాలను ఆదరించాలంటూ కొత్తగూడెంలోని 110 మందికి పైగా వ్యాపారులు శాంతియుత పోరాటం ప్రారంభించారు. తొలుత సమావేశం నిర్వహించుకుని 'మన ఊరు- మన దుకాణం'పేరిట ప్రజలు స్థానిక వ్యాపారాలను ఆదరించేలా కార్యాచరణ రూపొందించుకుని అమలు చేస్తున్నారు. 50 రోజులుగా రోజుకో నినాదం రూపొందించి నిత్యం 5 వేల మంది వినియోగదారులకు సామాజిక మాధ్యమాల ద్వారా పంపుతున్నారు. ఇవే నినాదాలు రాసిన ప్లకార్డులు దాదాపు 800 దుకాణాలలో ఏర్పాటు చేశారు. ఈ ఉద్యమం శనివారం నాటికి 50 రోజులు పూర్తిచేసుకుంది. దీంతో 10 శాతం మేర ఫలితం వచ్చిందని వ్యాపారులు చెబుతున్నారు.

పోటీని తట్టుకుని నిలబడేందుకే..
ప్రస్తుత పరిస్థితుల్లో వస్త్ర, కిరాణా, బంగారం, డిస్ట్రిబ్యూటర్స్, మొబైల్స్, కూరగాయలు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాన్సీ, ఎలక్ట్రికల్, టైలర్స్, చిరు వ్యాపారాలు మూసివేసే పరిస్థితి ఏర్పడుతోంది. పోటీ ప్రపంచంలో నిలబడేందుకే మన ఊరు-మన దుకాణం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు, మన పట్టణ అభివృద్ధికి అందరూ తోడ్పడాలని కోరుతున్నారు. స్థానిక వ్యాపారులు ఏటా వారి లాభాల్లో కొంత స్థానికంగా సేవ కార్యక్రమాలకు ఖర్చుచేస్తున్నారు. అదే కార్పొరేట్ వారు ఎంత లాభం వచ్చిన కూడా స్థానికులకు ఖర్చు చేసేది ఏమి ఉండదని, వినియోగదారులు ఆలోచించి స్థానిక వ్యాపారులను ప్రోత్సహించాలని కోరుతున్నారు.

ప్రజలంతా ఆలోచించాలి



కొత్తగూడెంలో బొగ్గు గని కార్మికుల అవసరాల కోసం వ్యాపారాలు మొదలయ్యాయి. అప్పటినుంచి అన్ని రకాల, నాణ్యమైన సామగ్రిని అందిస్తున్నాం. ప్రస్తుతం ఆధునిక పోకడలకు ఆకర్షితులు కావడంతో దశాబ్దాలుగా సాగుతున్న వ్యాపారాలు మూసివేసే పరిస్థితి ఏర్పడింది. ప్రజలంతా ఆలోచించాలి. –మొరిశెట్టి భవానీప్రసాద్, మన ఊరు-మన దుకాణం కార్యక్రమ రూపకర్త

ఊరు అభివృద్ధికి దోహదం..



మన ఊరు-మన దుకాణం కార్యక్రమంలో భాగంగా స్థానిక వ్యాపారాలను ప్రోత్సహించి ఊరు అభివృద్ధికి దోహదపడాలి. పోటీ ప్రపంచంలో పాతతరం వ్యాపారులు కొందరు వ్యాపారం బంద్ చేసి గుమస్తాలుగా జీవిస్తున్నారు. అలాంటి పరిస్థితులు పెరగకుండా ప్రజలు ఆలోచించి స్థానిక వ్యాపారులను ఆదరించాలి. –పల్లపోతు శ్రీనివాస్, వర్తక సంఘం సభ్యుడు

మా దగ్గరా ఆధునిక వస్తువులు..



ప్రజలంతా కూడా స్థానిక వ్యాపారులను ప్రోత్సహించేందుకు దశాబ్దాలుగా ఉన్న వారి దగ్గర కొనుగోలు చేయాలి. దీనివల్ల వ్యాపారుల అభివృద్ధితో పాటు ఊరు అభివృద్ధి కూడా ఉంటుంది. పోటీకి తగ్గట్టుగా పాతతరం దుకాణాల్లో కూడా ఆధునికానికి సంబంధించిన అన్నీ రకాలు లభ్యమవుతున్నాయి. –అనూప్ ఖండేల్‌వాల్, వర్తక సంఘం సభ్యుడు

ఇక ఆత్మీయ భేటీలు!

- నియోజకవర్గాల వారీగా నిర్వహణకు 'పొంగులేటి' నిర్ణయం
- తొలుత పినపాక సమావేశం ఈనెల 10న..
- మరోపక్క ఉమ్మడి జిల్లాలో స్పీడ్ పెంచిన బీఆర్‌ఎస్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లా రాజకీయాలు రోజురోజుకు రసకందాయంలో పడుతున్నాయి. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు, తన టీమ్ అంతా పోటీకి సిద్ధమని ప్రకటించడం ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో చర్చకు దారితీశాయి. ఆ తర్వాత ఆయన భద్రతను కుదించడం అనుచరగణంలో అసహనాన్ని తెప్పించాయి. ఈ వ్యవహారంలో బీఆర్‌ఎస్ నేతలు అడుగు ముందుకేసి ఆయనపై పరోక్షంగా విమర్శలు చేయడం రాజకీయాన్ని మరింత హీటెక్కించాయి. ఈ పరిణామాల పర్యవసానం ఎలా ఉన్నా.. పొంగులేటితోపాటు ఆయన అనుచరగణం మరింత దూకుడుగా వెళ్లాలని నిర్ణయించుకుని, ఆత్మీయ సమ్మేళనాల నిర్వహణకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే 10న పినపాక నియోజకవర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సారథ్యంలో ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు మొదలుపెట్టారు. మరోవైపు పొంగులేటి దూకుడుకు దీటుగా బీఆర్‌ఎస్ కూడా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాల్లో వేగం పెంచింది.

పినపాక నియోజకవర్గంతో షురూ..
మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వైఎస్సార్ సీపీ నుంచి పొంగులేటితో పయనించారు. 2014 ఎన్నికల్లో పినపాక నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఘన విజయం సాధించగా, పొంగులేటితోపాటు ఆయన టీఆర్‌ఎస్‌లో చేరారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసినా అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి రేగా కాంతారావు చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం రేగా టీఆర్‌ఎస్‌లో చేరగా, పాయంకు పార్టీపరంగా ప్రాధాన్యత తగ్గింది. ఉమ్మడి జిల్లాలో తొలి నుంచి పొంగులేటి ప్రధాన అనుచరుడిగా ఉన్న వెంకటేశ్వర్లు, నూతన సంవత్సర వేడుకలకు హాజరుకావడంతో ఆయనతోనే నడిచేందుకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది. ఇక మణుగూరు మండలం తోగ్గూడెం సమ్మక్క – సారక్క దేవాలయం వద్ద ఈనెల 10న పినపాక నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే నియోజకవర్గంలోని అనుచరగణానికి ఆహ్వానాలు పంపారు. పినపాకతో మొదలయ్యే ఆత్మీయ సమావేశాలు మిగిలిన నియోజకవర్గాల్లోనూ త్వరలో ఏర్పాటు చేసేందుకు పొంగులేటి అనుచరగణం కసరత్తు చేస్తోంది. ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం, అశ్వారావుపేట, సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు నియోజకవర్గాల్లో సమావేశాల నిర్వహణకు సిద్ధమైనట్లు సమాచారం. ముందు రాజకీయ పరిణామాలు ఎలా ఉన్నా.. కేడర్‌కు టచ్‌లో ఉండేందుకే ఈ సమ్మేళనాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెబుతున్నారు.

దీటుగా జోరు పెంచిన బీఆర్‌ఎస్..
పొంగులేటి అడుగులకు దీటుగా బీఆర్‌ఎస్ కూడా ఉమ్మడి జిల్లాలో జోరు పెంచింది. పొంగులేటి పార్టీపై వ్యాఖ్యలు చేసిన తర్వాత కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలవడం చర్చనీయాంశమైంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేందుకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సీఎంను కలిసినట్లు ప్రచారం సాగుతున్నా... రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ తర్వాత రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల్లో పర్యటించారు. రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయడంతోపాటు ప్రజల కోసం అభివృద్ధి చేస్తున్న తమ ఎమ్మెల్యేలను ఆశీర్వదించాలంటూ ఏకంగా ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా ప్రసంగించడం గమనార్హం. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కూడా ఈ రెండు, మూడు రోజుల్లోనే పాలేరు, సత్తుపల్లి, మధిర, కొత్తగూడెం నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు. సంక్రాంతి తర్వాత బీఆర్‌ఎస్ కూడా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మరింత దూకుడుగా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది.

భద్రత తగ్గింపుతో..
నూతన సంవత్సరం సందర్భంగా పొంగులేటి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న తన అనుచరులతో ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో ఆత్మీయ సమ్మేళనం పేరిట భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయన చేసిన వ్యాఖ్యలతో పొంగులేటి రాజకీయ ప్రస్థానంపై జోరుగా చర్చ సాగింది. అనంతరం 3+3 ఉన్న భద్రతను 2+2కు కుదించగా, ఎస్కార్ట్ వాహనం, ఇంటి వద్ద గార్డ్‌ను ప్రభుత్వం తొలగించింది. ఈ చర్యలతో ఆయన వర్గం అసహనానికి గురైంది. ఇక ఈ ఆదివారం పొంగులేటి ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నట్లు చెబుతూ క్యాంప్ కార్యాలయం నుంచి షెడ్యూల్ విడుదల చేశారు.

విద్యార్థినికి కలెక్టర్ సాయం

రూ.20 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేత



మెటీరియల్ అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు అవసరమైన మెటీరియల్‌ను శనివారం పేద విద్యార్థినికి కలెక్టర్ అనుదీప్ అందించారు. వైద్యవిద్య చదుకునేందుకు ఆర్థికసాయం చేయాలని చంద్రుగొండ మండలానికి చెందిన వాంకుడోత్ ప్రశాంతి ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంది. స్పందించిన కలెక్టర్ అనుదీప్ తగిన చర్యల నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. విద్యార్థిని తండ్రి రవి ప్రైవేట్ విద్యుత్ కార్మికునిగా పనిచేస్తూ గుండెపోటుతో మృతి చెందాడు. ఎంసెట్ ర్యాంకు ద్వారా డి. ఫార్మసీ సీటు వచ్చినా తండ్రి మృతితో కౌన్సెలింగ్‌కు హాజరు కాలేదు. బీఎస్సీ నర్సింగ్ చేసే అవకాశం కల్పించాలని విద్యార్థిని కోరగా.. సీటు కోసం ప్రయత్నం చేయగా ఫలించలేదు. దీంతో ప్రశాంతి తెలివి తేటలకు మెచ్చిన కలెక్టర్ వైద్యవిద్య పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని చెప్పి, రూ.20 వేల స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి విజేతను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు.

వేతన సమస్య పరిష్కరించాలి
సూపర్‌బజార్(కొత్తగూడెం)/టేకులపల్లి: ముంపు మండలాల్లోని ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించి సమస్యను పరిష్కరించాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ అనుదీప్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. 2015 జనవరి, ఫిబ్రవరి, మార్చిలో చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, భద్రాచలం, కుక్కునూరు, వేలేరుపాడు తదితర మండలాల ఉపాధ్యాయులకు అదనంగా ఒకటి నుంచి రెండు నెలల జమ అయ్యాయని పేర్కొన్నారు. ఇందులో ఉపాధ్యాయులు కొందరు డీడీ ద్వారా చెల్లించగా, మరికొందరు ఇవ్వకపోవడంతో కాగ్ నివేదిక ఆధారంగా ఉపాధ్యాయుల జీతాలు ఆపేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. అదనంగా జమ అయిన వేతనాన్ని వాయిదాల్లో చెల్లించేలా వెసులుబాటు కల్పించాలని కలెక్టర్‌ను కోరగా ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూక్య శంకర్ నాయక్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.మోహన్, శంకర్‌నాయక్‌తో పాటు రాంకుమార్, బిచ్చా, భద్రు పాల్గొన్నారు.

కలెక్టర్, ఎస్పీని కలిసిన జెడ్పీ చైర్మన్



కలెక్టర్ అనుదీప్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న జెడ్పీ చైర్మన్ కోరం

సూపర్‌బజార్(కొత్తగూడెం)/చుంచుపల్లి: జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ కోరం కనకయ్య శనివారం కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇద్దరికీ పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో రామయ్యకు శనివారం సువర్ణ తులసీ అర్చన పూజలు చేశారు. తొలుత తెల్ల వారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల నడుమ గర్భగుడి నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. స్వామి వారి నిత్యకల్యాణంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి భానుమతి



మాట్లాడుతున్న మాట్లాడుతున్న జడ్జి భానుమతి

ములకలపల్లి : ప్రతీ ఒక్కరూ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. భానుమతి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మారుమూల గ్రామాల్లో చట్టాలపై అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో భూవివాదాలు ఎదురైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. న్యాయ సేవాధికార సంస్థ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విభాగం ఆవిర్భావం తర్వాత తొలిసారిగా ములకలపల్లిలో సదస్సు ఏర్పాటు చేయడంపట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. తొలుత మండలకేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దీప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంప్రసాద్, జిల్లా లీగల్ సర్వీసెస్ సభ్యులు తోట మల్లేశ్వరరావు, మెండు రాజమల్లు, ఎండీ. సాధిక్ పాషా, రమణ, ఎస్సై బాల్దె సురేశ్, సర్పంచ్‌లు వాడే నాగరాజు, కారం సుధీర్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోరంపూడి అప్పారావు, శనగపాటి అంజన్‌రావు, పువ్వాల మంగపతి, మేకట పెద్దవెంకన్న, బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, రవి, చందర్‌రావు పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక బస్సులు

- జిల్లాలోని మూడు డిపోల నుంచి 188 సర్వీసులు
- సాధారణ చార్జీలతోనే ప్రయాణించే అవకాశం
- ఈ నెల 19వ తేదీ వరకు తిప్పనున్న అధికారులు



కొత్తగూడెం బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

చుంచుపల్లి: తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతి పండుగకు సుదూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వస్తుంటారు. ప్రయాణికుల సౌకర్యం కోసం ఆర్టీసీ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ సారి కూడా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. శనివారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు డిపోల నుంచి ఈ ప్రత్యేక బస్సులు రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. కొత్తగూడెం ఆర్టీసీ డివిజన్ పరిధిలో 188 బస్సు సర్వీసులను హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, కరీంనగర్, ఖమ్మంతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాలకు నడుపుతున్నారు. హైదరాబాద్ రూట్ ఒక్కటే ప్రతి పండుగ సీజన్‌లో ఆర్టీసీకి అధిక ఆదాయం తెచ్చి పెడుతోంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా నుంచి హైదరాబాద్‌కు అధికారులు మూడు డిపోల నుంచి ఎక్కువ సర్వీసులను కేటాయించారు. ఈ నెల 11,12,13 తేదీల్లో ఎక్కువ సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మరికొన్ని సర్వీసులను అప్పటికప్పుడు నడిపేందుకు సైతం ఏర్పాట్లు చేస్తున్నారు. పండుగలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలను ఆర్టీసీ ఎత్తి వేసిన విషయం తెలిసిందే. ఈ సారి కూడా సాధారణ చార్జీ చెల్లించి ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించారు.

ఈ నెల 14 వరకు సర్వీసులు..
మొత్తం 188 బస్సుల్లో కొత్తగూడెం డిపో నుంచి 63 బస్సులు, భద్రాచలం నుంచి 79 సర్వీసులు, మణుగూరు నుంచి 46 బస్సులు ఏర్పాటు చేశారు. ఈ నెల 7వ తేదీన 22 సర్వీసులు తిప్పారు. 8న 17 బస్సులు, 9న 18 సర్వీసులు, 10న 12 బస్సులు, 11న 20 బస్సులు, 12న 29 సర్వీసులు, 13న 42 సర్వీసులు, 14వ తేదీన 14 బస్సుల చొప్పున నడిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంక్రాంతి పండుగకు మరింతగా ఆదాయాన్ని సమకూర్చుకునేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు అధికారులు, సిబ్బందికి ప్రధాన బస్టాండ్‌లో మకాం వేసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పండుగ ప్రయాణికులను దగ్గరుండి ఆర్టీసీ బస్సులు ఎక్కించేలా డ్యూటీలు వేస్తున్నారు. పండుగ తర్వాత కూడా ఈ నెల 16 నుంచి 19 వరకు తిరుగు ప్రయాణికుల కోసం ఆయా రూట్లకు ప్రత్యేక బస్సులను నడిపించేందుకు ఏర్పాట్లు చేశారు. గతేడాది సంక్రాంతి పండుగ సందర్భంగా కొత్తగూడెం డివిజన్ పరిధిలో 176 సర్వీసులు నడపగా, దాదాపు రూ.45 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ప్రతి పండుగ సీజన్‌లో భద్రాచలం డిపోకే అత్యధికంగా ఆదాయం వస్తోంది. ఈసారి గతేడాది కంటే ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి



సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి సొంతూళ్లకు వచ్చే ఆర్టీసీ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా 188 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశాం. మూడు డిపోల పరిధిలో సర్వీసులను అందుబాటులో ఉంచాం. బస్టాండ్లలో కూడా ప్రయాణికులకు సమాచారం ఇచ్చేందుకు సిబ్బందిని కేటాయించాం. సంక్రాంతి పండుగకు వచ్చే ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకొని సంస్థకు సహకరించాలి. –భవానీప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం

క్లుప్తంగా

నియామకం


హనుమత్ ప్రసాద్

జూలూరుపాడు: అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం, అఖిల భారత బ్రాహ్మణ పురోహిత, అర్చక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా జూలూరుపాడుకు చెందిన తేరాల హనుమత్‌ప్రసాద్ నియమితుల య్యారు. శనివారం ఖమ్మంలో ఆ సంఘం కోర్ కమిటీ సమావేశంలో ఎన్నిక నిర్వహించగా.. అఖిల భారత బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కావూరు ఆంజనేయ శాస్త్రి చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు ప్రసాద్ స్థానిక విలేకరులకు తెలిపారు.

కొత్త విద్యా చట్టంలో లోపాలను సవరించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజు

అశ్వారావుపేటరూరల్: నూతన విద్యా హక్కు చట్టంలోని లోపాలను గుర్తించి తక్షణమే వాటిని సవరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఊట్లపల్లి, జమ్మిగూడెం, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలిక, బాలుర పాఠశాలలు, మైనార్టీ, బీసీ గురుకుల పాఠశాల వద్ద శనివారం నిర్వహించిన జీపు జాతా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యా విధానం భారతదేశ అవసరాలకు ఏమాత్రం అనుగుణంగా లేదని, లౌకిక ప్రజాస్వామిక, శాస్త్రీయ విలువలతో కూడిన ప్రత్యామ్నాయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టి నాణ్యమైన ఉచిత విద్యను అందించాలని కోరారు. అలాగే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయులకు సామాజిక భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా నాయకులు జె.మురళి మోహన్, మడివి కృష్ణారావు, టి.వీరేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన మద్యం మత్తు..

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దుమ్ముగూడెం: మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగులమందు తాగి మృతిచెందిన సంఘటన మండలంలోని చిన్నబండిరేవు గ్రామంలో శనివారం చోటుచేసుకుది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బోడ ఉప్పలయ్య(48) మద్యానికి బానిసై శనివారం కూడా తాగి ఇంటికొచ్చాడు. అప్పటికే ఆయన భార్య కూలీ పనుల కోసం వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాగిన మైకంలో ఇంట్లో ఉన్న పరుగులమందు తాగాడు. ఈ విషయాన్ని చుట్టుపక్కల వారు ఆయన భార్యకు తెలుపగా.. హుటాహుటిన భద్రాచలం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పెద్దాస్పత్రిలో వ్యక్తి మృతి

ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ


నవీన్‌కుమార్ మృతదేహం

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించటంతోనే ఆయన మృతి చెందాడని ఆరోపించిన కుటుంబ సభ్యులు.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరుకు చెందిన మంచాల నవీన్ కుమార్(42)కు జ్వరం రావటంతో ఈనెల 4న అక్కడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు సరిగా స్పందించకపోడంతో అదే రాత్రి ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించారు. ఈమేరకు వైద్యులు వైద్యసేవలు అందిస్తుండగా, ఆయన అతని ఆరోగ్య పరిస్థితిలో మార్పు రాకపోవడంతో శనివారం ఉదయం మృతి చెందాడు. అయితే, వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశారు.

విద్యుదాఘాతంతో కూలీ..

పాల్వంచ: లారీలో కర్ర లోడింగ్ చేస్తుండగా బిహార్‌కు చెందిన ఓ కూలీ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం దమ్మపేట రోడ్డులో గల సత్యం కాంటా వద్ద లారీలో బిహార్ రాష్ట్రం వెస్ట్ చెంపారన్ మండలం మధువన్‌ఘాట్‌కు చెందిన రాజేష్‌కుమార్‌సహాని (24) జమాయిల్ కర్ర లోడింగ్ చేస్తున్నాడు. ఈక్రమంలో పచ్చి కర్ర కావడంతో పైన ఉన్న విద్యుత్ తీగల నుంచి విద్యుత్ సరఫరా జరిగి కింద పడిపోయాడు. దీంతో తోటి కూలీలు గుర్తించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. బంధువు సురేంద్రసహాని ఫిర్యాదు మేరకు ఎస్సై కె.నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

జాబ్ మేళాకు స్పందన


మెగా జాబ్ మేళాను ప్రారంభిస్తున్న రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు


కంపెనీల వివరాలను పరిశీలిస్తున్న నిరుద్యోగులు

- పెద్ద సంఖ్యలో హాజరైన నిరుద్యోగులు
- కష్టపడితేనే ఫలితం : హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. మేళాను ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రారంభించారు. 8 వేల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 7 వేల మంది హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. 70 కంపెనీల్లో 2,700 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని, వీరిలో 133 మంది దివ్యాంగులు ఉన్నారని పేర్కొన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు నియామక పత్రాలు అందజేసి మాట్లాడుతూ కష్టపడ్డ వారికే ఫలితం దక్కుతుందని అన్నారు. ఉద్యోగాలు పొందిన వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని, వారందరికీ సంక్రాంతి పండుగ ముందుగానే వచ్చిందని పేర్కొన్నారు. తన వంతు బాధ్యతగా నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ట్రస్ట్ ఆఫీసులో ఎంప్లాయ్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాను కొత్తగూడెంలో పుట్టినందుకు ఈ ప్రాంత రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నానని పేర్కొన్నారు. అయితే ఇక్కడ చాలా మంది కొత్తగూడెం నుంచి చాలా తీసుకున్నారని, అవన్నీ రాబట్టాల్సిన అవసరముందని అన్నారు. అనంతరం గడల శ్రీనివాసరావును పలు సంఘాల నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్, నాయకులు మద్దెల శివకుమార్, సింధూతపస్వి, కాంపెల్లి కనకేష్, నిషాంత్, కల్లోజీ శ్రీనివాస్, ఇమంది ఉదయ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు భీమా శ్రీధర్, మహ్మద్ యూసఫ్, ట్రస్ట్ సభ్యులు జోగారావు, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పలువురిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రి ఇంద్రకరణ్ రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హైదరాబాద్‌లో శనివారం పలువురిని మర్యాదపూర్వకంగా కలిశారు. డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అంజనీ కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ టు చీఫ్ మినిస్టర్ ఆఫ్ తెలంగాణ నర్సింగరావును కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, న్యాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని అరణ్యభవన్‌లో కలిసి పాల్వంచలోని శ్రీనివాసగిరిపై ఉన్న దేవాలయానికి సంబంధించిన రోడ్ నిర్మాణానికి స్టేజ్–1 క్లియరెన్స్ గురించి చర్చించారు. అనంతరం చర్చకు సంబంధిత ఫైల్‌ను రీజనల్ కార్యాలయానికి తరలించారు.



వివిధ రకాల మొక్కలతో పచ్చని ప్రకృతి ఒ(బ)డిలో ఎంతో ఆహ్లాదకరంగా ఉన్న ఈ దృశ్యాన్ని చూసి ఇదేదో కార్పొరేట్ లేదా ప్రైవేట్ బడి అనుకుంటే పొరబడినట్లే. ఇది అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం గ్రామంలోని ప్రభుత్వ యూపీఎస్ పాఠశాల. దీన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మీనర్సుతోపాటు గ్రామపెద్ద హరిబాబు సహకారంతో పాఠశాల ఆవరణలో దాదాపు రూ.ఇరవై వేల ఖర్చుతో మొక్కలతో పాటు పాఠశాల లోపలికి వెళ్లేందుకు టైల్స్‌తో ఫుట్‌పాత్‌ను నిర్మించి ఎంతో అందంగా ముస్తాబు చేయించారు. దీన్ని చూసిన వారంతా ప్రకృతి ఒడిలా సర్కారు బడి ఉందంటున్నారు.శనివాసం ఈ దృశ్యాన్ని 'సాక్షి'కెమెరాలో క్లిక్ మనిపించింది.
– అశ్వారావుపేటరూరల్

నాటిన ప్రతీ మొక్క బతకాలి


పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

మంచుపల్లి: మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి నాటిన ప్రతీ మొక్క బతికేలా చూడాలని జెడ్పీ సీఈఓ విద్యాలత తెలిపారు. శనివారం మండల పరిధిలోని 3 ఇంక్లైన్ గ్రామపంచాయతీలో పర్యటించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. రోడ్ డివైడర్ మధ్యలోని దెవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించాక ఆమె మాట్లాడారు. మండలంలో ప్రతి హాబిటేషన్‌లో క్రీడా ప్రాంగణాల నిర్మాణ పనులు పూర్తి చేయాలని చెప్పారు. నర్సరీల్లో బ్యాగ్ ఫిల్లింగ్ తర్వాత వెంటనే విత్తనాలు నాటాలని సూచించారు. ప్రతి డంపింగ్ షెడ్‌లో తడి, పొడి చెత్తలను వేరు చేయడం ద్వారా సేంద్రియ ఎరువు తయారవుతుందని.. ఈ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ఎంపీడీఓ సకినాలా రమేష్, ఎంపీఓ గుంటి సత్యనారాయణ, సర్పంచ్ ఆంగోతు మోతి, పంచాయతీ కార్యదర్శి పాషా, తదితరులు ఉన్నారు.

పోలీసులకు చిక్కిన ఇద్దరు దొంగలు


పట్టుబడిన దొంగలతో ఎస్సై సంతోష్

బూర్గంపాడు: పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు శనివారం పట్టుకున్నారు. స్థానిక ఎస్సైసంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం సారపాకలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. సారపాక గాంధీనగర్‌కు చెందిన వాంకుడోత్ సాయి, అన్నపరెడ్డిపల్లికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తేలింది. వారు గత ఏడాది మార్చిలో సారపాకలో దొంగతనానికి పాల్పడి బంగారు, వెండి అభరణాలను దొంగిలించినట్లు నేరం అంగీకరించారు. చోరీ చేసిన అభరణాల విలువ సుమారు రూ.4లక్షల వరకు ఉంటుందని తెలుపగా.. వారి వద్ద ఉన్న బంగారు అభరణాలు స్వాధీనం చేసుకుని కోర్టుకు రిమాండ్ చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ

చుంచుపల్లి: ప్రధాన రహదారులు, కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను సులువుగా అదుపు చేయొచ్చని, నిఘా మరింత పెరిగి భద్రత ఏర్పడుతుందని కొత్తగూడెం డీఎస్పీ వెంకటేశ్వరబాబు అన్నారు. శనివారం చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌కెనగర్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పోలీస్ శాఖకు సహకరిస్తున్న స్థానికులు, ప్రజాప్రతినిధులను అభినందించారు. ప్రజల సహాయ సహకారాలతోనే సమాజంలో శాంతి భద్రతలను కాపాడవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రమాకాంత్, ఎస్సై సుమన్, కాలనీకి చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రపంచమంతా భగవత్ స్వరూపమే..

సత్తుపల్లిరూరల్: ప్రపంచంలోని సర్వ ప్రాణులన్నీ భగవత్ స్వరూపాలేనని ప్రవచనకర్త రామకృష్ణమాచార్య తెలిపారు. మండలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అల్వా ల్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు, టీటీడీ ఆధ్వర్యాన జరుగుతున్న ధనుర్మాసం తిరుప్పావై ప్రతం శనివారం 23వ రోజుకు చేరింది. ఈ సంర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించాక రామకృష్ణమాచార్య మాట్లాడారు. భగవంతుడిలోని దయ అమ్మరూపంగా ప్రోత్సహిస్తే, ఈ విశ్వాన్ని భగవంతుడు సృష్టించాడని తెలి పారు. ప్రతీ వస్తువు, ప్రతీ ప్రాణిలోనూ ఉండే భగవంతుడే ఈ ప్రపంచాన్ని నడుపుతున్నారని చెప్పారు. అలా విశ్వమంతా భగవత్ స్వరూప మే అయినందున ప్రతీ ప్రాణిని గౌరవించి ప్రే మించడం నేర్చుకోవాలని సూచించారు. ధర్మకర్తలు అరుణకుమారి, శాంతికుమారి, విజ యశ్రీ, స్వరూపరాణి, రమాదేవి, నాగేంద్రమ్మ, శైలజ, స్వప్న, విజయలక్ష్మి, ప్రేమలత, వరలక్ష్మి, వసంత లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ఐఈడీ నిర్వీర్యం

దుమ్ముగూడెం: అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు నిర్వహిస్తున్న భద్రతా బలగాలు 25 కిలోల ఐఈడీని శనివారం నిర్వీర్యం చేశాయి. ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని నెల్‌నార్–మిర్తూర్–గంగళూరు ప్రధాన రహదారిపై బేచాపాల్–అటేపాల్ మధ్య ముండాతలాబ్ సమీపంలో గల మార్గ మధ్యలో మావోయిస్టులు అమర్చిన ఈ ఐఈడీని గుర్తించి బాంబు డిస్పోజబుల్ టీంకు సమాచారం అందించారు. దీంతో వారు ఆ సంఘటనా స్థలానికి చేరుకొని బాంబును నిర్వీర్యం చేశారు.

అక్రమ రవాణాకు రెవెన్యూ వత్తాసు..

- సమాచారమిస్తే తహసీల్దార్ దురుసుగా సమాధానం
- అధికారుల తీరును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనం


దిష్టబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చర్ల: ఇసుక అక్రమ రవాణా విషయమై అధికారుల ఇచ్చిన దురుసు సమాధానాన్ని నిరసిస్తూ శనివారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లి, లింగాపురం గ్రామాల సమీపంలోని గోదావరి నది నుంచి ట్రాక్టర్ల ద్వారా శనివారం మధ్యాహ్నం ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో ఇసుక ట్రాక్టర్లు కొత్తపల్లికి రాగా ప్రధాన రహదారిపై సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కొండా చరణ్ నేతృత్వంలో గ్రామస్తులు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు చర్లలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల నిర్మాణానికి తోలుతున్నామని సమాధానం చెప్పాడు. దీంతో చరణ్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని తెలుపగా.. ఆయన తామే అనుమతిచ్చామని బదులిచ్చాడు. కాగా, తహసీల్దార్ దురుసు సమాధానాలతో వాగ్వాదం జరుగగా.. అధికారుల తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టి దిష్టబొమ్మను దహనం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని ఆరోపిస్తూ నినాదాలు చేశారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: బీటెక్ చదువుతున్న ఓ మైనర్ బాలికను వేధిస్తున్న వ్యక్తిపై కొత్తగూడెంలో పోక్సో కేసు నమోదైంది. త్రీటౌన్ సీఐ అబ్బయ్య కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణ పరిధి కూలీలైన్ ఏరియాకు చెందిన మైనార్ బాలిక బీటెక్ చదువుతోంది. ఈ క్రమంలో గణేష్‌బస్తీకి చెందిన పి.అవినాష్ ఆ బాలికకు మాయమాటలు చెప్పి గత ఏడాది జూలై 2వ తేదీన పాల్వంచ మండల పరిధిలో కిన్నెరసానికి తీసుకెళ్లి బలవంతంగా లైంగికంగా లోబరుచుకున్నాడు. అనంతరం నగ్న ఫొటోలు తీసి షోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. ఇప్పటికే రూ.3 లక్షల వరకు తీసుకున్నా.. అవినాష్ డబ్బుల వేధింపులు ఆగకపోవడంతో ఆ బాలిక కుటుంబసభ్యులకు తెలిపింది. దీంతో వారు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద అవినాష్‌పై కేసు నమోదు చేశారు.

మెరుగైన సేవలు అందించాలి

ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్


కొత్త విద్యుత్ లైన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రమేష్ తదితరులు

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ సమస్యలు లేకుండా పని చేయాలని, వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేష్ అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురం, కొత్త గంగారం, అశ్వారావుపేట గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఇటీవల తిమ్మాపురం, కొత్త గంగారం గ్రామాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి విద్యుత్ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. రైతాంగానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మెరుగైన విద్యుత్‌ను అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోని శివశంకర ప్రసాద్, ట్రాన్స్‌కో డీఈఈ శేషాద్రి, ఏడీఈ వెంకటేశ్వర్లు, ఏఈ శివశంకర్, లైన్ ఇన్‌స్పెక్టర్ గంటా వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ ఘటనపై..

దుమ్ముగూడెం: మండలంలోని కన్నాపురం గ్రామంలోని పొలంలో సబ్ మెర్సిబుల్ మోటార్, కరెంట్ మీటర్ చోరీ ఘటనపై ఎస్సై రవికుమార్ శనివారం కేసు నమోదు చేశారు. వివరాలిలా.. గ్రామానికి చెందిన బానోత్ బావూర్యకు సంబంధించిన పొలంలోని మోటార్, కరెంట్ మీటర్‌ను గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. వాటి విలువ సుమారు రూ.11వేలు ఉంటుందని బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై..

దమ్మపేట: ఓ వ్యక్తిని అసభ్య పదజాలంతో దూ షిస్తూ, దాడి చేసిన సంఘటన మండల పరిధి లోని నాగుపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని నాగుపల్లి గ్రామానికి చెందిన దారావత్ వెంకటేశ్వరరావు, అదే గ్రామంలో గల తన వ్యవసాయ క్షేత్రాన్ని, వరి సాగు చేయుటకు సిద్ధం చేశాడు. అయితే ఈ నెల 3వ తేదీన అదే గ్రామానికి చెందిన అంగోతు రాంబాబు తన గేదేలను అదే వ్యవసాయ క్షేత్రంలోకి మేతకు తోలాడు. ఈ విషయమై వెంకటేశ్వరరావు, గేదేలను వరి పొలంలోకి ఎందుకు తోలావు అని ప్రశ్నిస్తూ రాంబాబును మందలించాడు. దీంతో రాంబాబు తన కుమారుడితో కలసి వెంకటేశ్వరరావును అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు చంపేస్తామని బెదిరించి భౌతికదాడికి పాల్పడ్డారు. బాధితుడు వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

ప్రైవేట్‌కు దీటుగా సింగరేణి పాఠశాలలు


బహుమతి అందిస్తున్న సింగరేణి అధికారులు

మణుగూరు రూరల్: ఉన్నత ప్రమాణాలు కల్గిన సింగరేణి పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యా బోధన చేస్తున్నట్లు సింగరేణి జీఎం(ఎడ్యుకేషన్) అండ్ సెక్రటరీ వెంకటేశ్వరరావు అన్నారు. మణుగూరు ఏరియా వీపీ కాలనీలోని సింగరేణి పాఠశాల 45వ వార్షికోత్సవ వే డుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా జీఎంతో పాటు ఏరియా ఇన్‌చార్జ్ జీఎం జి.నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. సకల సౌకర్యాలతో అందిస్తున్న విద్యాబోధనను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని అంకితభబూవంతో చదవాలని సూచించారు. అనంతరం వివిధ క్రీడలు, పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు, ఉత్తమ ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. పూర్వవిద్యార్థులు బాలకృష్ణ, ప్రవీ ణ్‌కుమార్‌లను పాఠశాల హెచ్ఎం స్వరూపరాణి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎ(పర్సనల్), కరస్పాండెంట్ రమేష్, ఆర్.కల్యాణి, ఎస్.అనురాధ, ఎం.కృష్ణబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.